● పండుగ సంబరం

జల్లికట్టు జోష్


గుడుపల్లెలో పరుగు తీస్తున్న పశువులు

గుడుపల్లె, జనవరి 16: కనుమ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల్లో జల్లికట్టు నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు తమ పశువులను అలంకరించి ఆలయాల వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు. డప్పువాయిద్యాల నడుమ గ్రామంలోని వీధుల్లో పరిగెత్తించారు. పశువులను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. పశువుల పండుగను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో గ్రామాలకు తరలి వచ్చారు. ఆయా గ్రామాల్లోని పెద్దలు అన్నదానం నిర్వహించారు. గుడుపల్లెలో జరిగిన పశువుల పండుగతో గ్రామం జనసంద్రంగా మారింది.




పట్టీ దొరికిందోచ్ - పరుగెడుతున్న గిత్తలు - నచ్చుకూరు జల్లికట్టు అల్లిలో జనం

నచ్చుకూరులో..

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం నచ్చుకూరులో మంగళవారం జల్లికట్టు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కోడె గిత్తలతో రైతులు.. వీక్షించడానికి జనం తరలివచ్చారు. గిత్తల కొమ్ములకు బహుమతులుగా ఉపయోగించే పట్టీలను వివిధ దేవుళ్ల, రాజకీయ ప్రముఖుల, గిత్తల కుటుంబీకుల ఫొటోలతో కూడిన ఆకృతుల్లో కట్టారు. అల్లిలో సిద్ధంగా ఉన్న యువకుల వైపు గిత్తలను పురికొల్పి తరిమారు. గిత్తలను నిలువరించడానికి యువకులు ప్రయత్నించారు. గిత్తల కింద పడిన కొందరు యువకులకు గాయాలయ్యాయి.

సోమలలో చిట్లాకుప్ప


సోమలలో చిట్లాకుప్ప వద్ద జనసందడి

సోమల, జనవరి 16: కనుమ సందర్భంగా సోమల మండలంలోని పలు గ్రామాల్లో పశువుల పండుగ జరుపుకొన్నారు. ఇళ్ల ముందు ముగ్గులు వేసి గోపేడతో గొబ్బెమ్మను తయారు చేసి తంగేడు పూలతో అలంకరించి పూజలు చేశారు. పశువులను అలంకరించారు. నంజంపేట, కమ్మపల్లె, గట్టువారిపల్లె, ఎర్రనాగులపల్లెలో పశువులకు పరుగు పందేలు జరిపారు. వీటిని నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. పశువుల పాకల వద్ద పూజలుచేసి పొంగళ్లు పెట్టారు. సాయంత్రం పశువులను కాటమరాజు ఆలయంవద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేసి, చిట్లాకుప్పల చుట్టు ప్రదక్షిణలు చేయించారు. కాటమరాజుకు జంతుబలులిచ్చారు. సోమల శెట్టివారి వీధిలో రాత్రి గ్రామస్తులు సహపంక్తి భోజనాలు చేశారు.



తుమ్మిందలో రంకెలేసిన గిత్తలు

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద గ్రామంలో కోడెగిత్తలు రంకెలేశాయి. జల్లికట్టులో భాగంగా ఎద్దుల కొమ్ములకు కట్టిన బహుమతుల పట్టీల కోసం యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కాగా, జల్లికట్టు నిర్వహణపై మొదట పోలీసులు ఆంక్షలు విధించారు. అయితే నాయకుల జోక్యంతో జల్లికట్టు జరిగింది.

కాణిపాకంలో కనుమ వేడుకలు

ఐరాల(కాణిపాకం), జనవరి 16: కాణిపాక వినాయక స్వామి ఆలయం వద్ద మంగళవారం కనుమ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం గోశాలలోని గోవులను అలంకరించి పూజలు నిర్వహించారు. వాటికి పచ్చగడ్డి, అరటిపండ్లు, బెల్లం, నానబెట్టిన బియ్యాన్ని తినిపించారు. ప్రధాన.. అనుబంధ ఆలయాలతో పాటు మాడవీధుల్లో గోవులను తిప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు హరిమాధవ రెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, అర్చక, పండితులు పాల్గొన్నారు.


వరదరాజస్వామి ఆలయం వద్ద సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు, ప్రజలు


పశువులకు పచ్చిక పెడుతున్న అధికారులు



కెంచనబల్లలో ఎద్దుల పండుగ

రామకుప్పం: రామకుప్పం మండలం కెంచనబల్ల, పచ్చారుమాకులపల్లె గ్రామాల్లో ఎద్దుల పండుగ నిర్వహించారు. జనసమూహం మధ్య రైతులు తమ ఎద్దులను పరుగులు తీయించారు. నిర్వాహకులు ఎద్దులకు కట్టిన లుంగీలను చేజిక్కించుకునేందుకు పోటీలు పడ్డారు. సంక్రాంతి సందర్భంగా శ్మశానాల వద్దకు వెళ్లి పూర్వీకుల సమాధులకు పూజలు చేశారు. వారి ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు.

పండుగపూట విషాదం

● చలపలమ్మ కోనలో ఈతకెళ్లి ఇద్దరు యువకుల మృతి


రాత్రి వేళ మృతదేహాలను వెలికి తీస్తున్న ఫైర్‌సిబ్బంది

నగరి, జనవరి 16: పండుగ రోజున విషాదం నెలకొంది. సరదాగా ఈత కోసం చలపలమ్మ కోనకు వెళ్లిన పది మంది యువకుల్లో ఇద్దరు మృతిచెందారు. ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. కనుమ రోజైన మంగళవారం పది మంది స్నేహితులు సరదాగా గడుపుదామని భావించారు. వీరంతా కలిసి నగరి మండలం తడుకుపేట సమీపంలోని చలపలమ్మ కోనకు విహారానికి వెళ్లారు. అక్కడి డ్యామ్‌లో ఈత కొడుతుండగా ఇద్దరు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని సహ యువకులు స్థానికులకు తెలియజేయగా, వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గల్లంతైన వారిలో ఒకరు నగరి పట్టణం కొత్తపేటకు చెందిన కార్తీక్(30), మరొకరు తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి తాలూకా మద్దూరుకు చెందిన ఉమాకాంత్(26) గా పేర్కొన్నారు. ఈ ఇద్దరి కుటుంబీకులూ డ్యామ్ వద్దకు చేరుకున్నారు. నగరి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలించారు. చివరకు రాత్రి 8గంటలకు ఒక మృతదేహాన్ని, 8.30 గంటలకు మరో మృతదేహాన్ని బయటకు తీశారు. తమ సిబ్బందితో ఎస్‌ఐ కుళ్లాయప్ప సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుల్లో ఉమాకాంత్‌కు రెండేళ్ల క్రితం వివాహమైందని, కార్తీక్‌కు ఇద్దరు పిల్లలున్నట్లు వారి కుటుంబీకులు తెలిపారు.


కార్తీక్, ఉమాకాంత్ (ఫైల్ ఫొటోలు)

నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకలు


తల్లిదండ్రుల సమాధుల వద్ద చంద్రబాబు పూజలు


కొబ్బరికాయ కొడుతున్న లోకేశ్

చంద్రగిరి, జనవరి 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తన స్వగ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.కుటుంబ సభ్యులతో,బంధువులతో కలిసి రెండు రోజులపాటు నారావారిపల్లెలో వున్న ఆయన సోమవారం ఉదయం 10.30 గంటలకు తెలుగు సంప్రదాయం ఉట్టి పడేలా పంచెకట్టు ధరించి సోదరి హైమావతి, సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనవడు దేవాన్ష్, బావమరిది నందమూరి రామకృష్ణ, వదిన లోకేశ్వరి, మరదలు నారా ఇందిర, ఆమె కుమారుడు సినీహీరో నారా రోహిత్, నందమూరి బాలకృష్ణ భార్య వసుంధర, చిన్న కుమార్తె తేజస్విని, ఆమె భర్త భరత్, కుమారుడు ఆర్యవీర్, కంతమనేని శ్రీనివాస్, శ్రీమాన్ తదితరులతో కలిసి ఇంటి సమీపంలో వున్న గ్రామ దేవత దొడ్డి గంగమ్మ వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పొలాల వద్దవున్న కులదేవత నాగాలమ్మకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11.30 గంటలకు చంద్రబాబు తన తల్లిదండ్రుల సమాధుల వద్దకు చేరుకుని నారా ఖర్జూర నాయుడు, అమ్మణ్ణమ్మలకు నివాళులర్పించారు.ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని, పూలమాలలు వేసి నివాళులర్పించారు.చూడ్డానికి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమస్యలు వింటూ వారితో ఫొటోలు దిగారు.మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, డొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, టీడీపీ నేతలు గాలి భానుప్రకాష్, కొల్లూరి ఇందుశేఖర్, థామస్, నరసింహ యాదవ్, శ్రీనాథ రెడ్డి, అనీషారెడ్డి, జెడ్డా రాజశేఖర్, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు,రామ్‌దాస్‌చౌదరి తదితరులు చంద్రబాబుతో,లోకేశ్‌తో మాట్లాడారు.


ఎన్టీఆర్‌కు నివాళులు


నాగాలమ్మకు భువనేశ్వరి,ఇందిర పూజలు

ఆకట్టుకున్న ఎన్టీఆర్ వేషధారణ

బాపట్ల జిల్లా పరుచూరు నియోజకవర్గ టీడీపీ నేత నాగేశ్వరరావు అలియాస్ అచారి ఎన్టీఆర్ వేషధారణలో నారావారిపల్లెలో సందడి చేశారు.దానవీరశూరకర్ణ సినిమా డైలాగులు చెప్పి అందర్నీ ఆకట్టుకున్నారు.సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నారావారిపల్లె నుంచి చంద్రబాబు తిరుగుప్రయాణమయ్యారు. రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి వెళ్తూ చంద్రగిరి పార్టీ ఇన్‌చార్జి టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ఇంటికి వెళ్ళారు.దొంగ ఓట్లను తొలగించకపోవడంపై నిరసనగా చేపట్టిన నిరాహారదీక్షను పోలీసులు భగ్నం చేస్తే మనస్తాపం చెంది పెట్రోల్ పోసుకుని అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న నానీని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అక్కడి నుంచి రేణిగుంట సమీపంలోని విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదుకు వెళ్ళారు. సోమవారం మధ్యాహ్నం 3.45 గంటలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎ.రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విజయవాడకు వెళ్ళారు.

నాని ధర్మపోరాటాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి


నానీని పరామర్శిస్తున్న చంద్రబాబు

చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లపై పులివర్తి నాని ఆరు నెలలుగా ధర్మపోరాటం చేస్తున్నారు. ప్రజలు కూడా ఆయన పోరాటాన్ని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు.నానీని ఆయన నివాసంలో పరామర్శించాక మీడియాతో మాట్లాడుతూ 'చంద్రగిరి నియోజకవర్గంలో 6 మండలాలున్నాయి. పక్కనే తిరుపతి, శ్రీకాళహస్తి, జీడీ నెల్లూరు, పుంగనూరు, పూతలపట్టు, పీలేరు నియోజకవర్గాల్లో ఇక్కడి ఓటర్లను అక్కడికి, అక్కడి ఓటర్లను ఇక్కడికి మార్చేశారు. వైసీపీ వాళ్లు చేసే మోడ్ ఆఫ్ ఆపరేషన్ అంతుచిక్కని విధంగా ఉంది. ఫామ్ 6, 7, 8లను విచ్చలవిడిగా వినియోగించారు. 2019లో 290000 ఓట్లకు 325 బూత్‌లు ఉంటే, ఇప్పుడు 308000 ఓట్లకు 395 బూత్‌లకు పెంచేశారు.ఎమ్మెల్యే స్వగ్రామం తుమ్మలగుంటలో 4 బూత్‌లను 7 చేశారు. 37వేల ఓట్లు మార్పులు, చేర్పులు వచ్చాయి. ఫామ్ 6 ద్వారా 25వేల కొత్త ఓట్లు చేర్చారు. అందులో 40 నుంచి 80 ఏళ్ల వయస్సు గల 6వేల మంది కొత్త ఓటర్లు వచ్చారు. వారు ఎక్కడనుంచి వచ్చారో తెలియదు.ఒకే ఫొటో (పీఎస్‌ఈ)కలిగినవి 13800 ఓట్లున్నాయి. సంగీత హరి పేరుతో తిరుపతిలో ఒకటి, హరి సంగీత పేరుతో చంద్రగిరిలో మరొక ఓటును చేర్చారు. దువ్వాల క్రాంతి, మల్లంగుంట మహేష్, నందిని బసుమూర్తి, మల్లగుంట్ల బలరాముడు, సతీష్‌కుమార్ అల్లంపాటి, మరిశెట్టి గురవయ్య వంటి పేర్లను శ్రీకాళహస్తి, చంద్రగిరి, తిరుపతి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఇంటిపేరును అటూ, ఇటూ మార్చి, ఫొటోలు బ్లర్ చేసి చేర్చారు. దీన్నిబట్టి అధికారులు వైసీపీతో ఏస్థాయిలో కుమ్మక్కయారో తెలుస్తోంది. బూత్‌లు మార్చారు. నియోజకవర్గాలు మార్చారు. వారి ఇష్టానుసారం చేసిపెట్టారు. పేరును నెంబర్లు మార్చేసి మూడు బూత్‌లలో వేశారు. కరుడుకట్టిన నేరస్తులు, ఉగ్రవాదుల కన్నా దారుణంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే ఓటరు అవకతవకలపైన చంద్రగిరిని కేస్ స్టడీగా ఎన్నికల సంఘాన్ని తీసుకోమన్నాం' అని చెప్పారు. మాజీ మంత్రులు అమరనాథ రెడ్డి, పరసారత్నం, టీడీపీ నేతలు నరసింహ యాదవ్, గాలి భానుప్రకాష్ తదితరులు ఆయన వెంట వున్నారు.

అనవసర వస్తువులతో 'స్ట్రాంగ్'!

● ఏళ్ల తరబడి తొలగించక స్థల సమస్య


ఖజానా కార్యాలయం వద్ద వున్న స్ట్రాంగ్ రూమ్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 16: విలువైన వస్తువుల పేరిట జిల్లాలోని ఉపఖజానా స్ట్రాంగ్ రూముల్లో శ్రద్ధగా నిల్వచేస్తున్న ప్రభుత్వశాఖలు.. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకెళ్లడం లేదు. దీంతో 'స్ట్రాంగ్ రూము'లు అనవసర వస్తువులతో నిండిపోయాయి. ఆ కార్యాలయ సిబ్బంది కూడా లోపలకు అడుగువేయలేకపోతున్నారు. మొత్తం 93 ప్రభుత్వ శాఖలు పనిచేస్తుండగా, వాటిలో 15శాతం కార్యాలయాలకు చెందిన వస్తువులను ఖజానా స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తున్నారు.

సార్వత్రిక, ఉపఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీప్యాట్లను కలెక్టరేట్‌లోని ఎన్నికల గోదాములో రెవెన్యూ యంత్రాంగం ఉంచుతుంది. ఇతర బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పేపర్లు, కవర్లు, సీల్డ్ మెటీరియల్, పీవో, ఏపీవో ఎన్నికల నిర్వహణ పుస్తకాలు, ఇతరత్రా వాటిని ట్రంకుపెట్టెల్లో ఉంచి సీల్ చేసి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తారు. అలాగే, 'పరిషత్తు' ఎన్నికల బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, కవర్లు, సీళ్లు, ఎన్నికల అనంతరం మిగిలే పోలింగ్ సామగ్రిని ట్రంకుపెట్టెల్లో పెట్టి సీల్ చేసి, వాటిని కూడా ఈ స్ట్రాంగ్‌రూమ్‌ల్లోనే భద్రపరుస్తారు. కోర్టు వివాదాల్లో ఉన్న ఎన్నికలకు సంబంధించిన ఫారాలు, బ్యాలెట్ పత్రాలు తదితర వాటిని తుదితీర్పు వచ్చేంతవరకు ఇక్కడే ఉంచుతారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, ఇంటర్ బోర్డు, విద్యాశాఖ నిర్వహించే పబ్లిక్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన మిగులు ప్రశ్నపత్రాలు, వినియోగించని జవాబుపత్రాలు, ఇతర పరీక్షల మెటీరియల్‌నూ ఇక్కడ ఉంచుతారు. పొలాల్లో, ఇతరత్రా ప్రాంతాల్లో దొరికే దేవతావిగ్రహాలు, కేసు విచారణలో ఉండే విగ్రహాలు, దేవదాయశాఖకు సంబంధించిన ఇతర ఆస్తులు, ముఖ్య ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన నగదు, చెస్ట్ ఐరన్ తాళాలు తదితరాలనూ ఇక్కడే నిల్వచేస్తారు. వినియోగంలో లేని స్టాంపులు, గ్రామపంచాయతీల్లో వాడిన, వాడని పాతకాలం నాటి చెక్కుపుస్తకాలు, పాసుపుస్తకాలు, ఎన్నికల సమయాల్లో తనిఖీల్లో పట్టుబడి స్వాధీనం చేసుకున్న లెక్కలు చూపని నగదును ఇక్కడ సీల్డ్ కవర్‌లో భద్రపరుస్తున్నారు.

గెజిట్‌లో పబ్లిష్ చేయాలి

పదేళ్ల నుంచి ఉన్న వస్తువుల వివరాలను గెజిట్‌లో ప్రచురించాలి. నిల్వ ఉన్న వాటిలోని బంగారు, వెండి వస్తువులను సెంట్రల్ ఎక్సైజ్‌శాఖకు తరలించాలి. కరెన్సీ ఉంటే ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి. ఇనుప తాళాలను పీడబ్ల్యూశాఖకు అప్పగించాలి. ఐదేళ్లకు మించి నిల్వవున్న చెక్కుపుస్తకాలు, వాడకంలో లేని జ్యుడీషియల్, నాన్ జ్యుడీషియల్ స్టాంపులు, కోర్టు ఫీజు స్టాంపులను జేసీ అనుమతితో.. ఆయన పర్యవేక్షణలో కాల్చేయాలి. ఇటువంటి కార్యక్రమాన్ని ఖజానాశాఖ చేపట్టడం లేదు.

పోలీసు భద్రత భారం ఖజానాదే

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 13 ప్రాంతాల్లో స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్నాయి. వాటి పర్యవేక్షణ బ్రిటీష్ కాలం నుంచీ ఖజానాశాఖ అధికారులే చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో కలెక్టరేట్‌తో పాటు చిత్తూరు, బంగారుపాళ్యం, నగరి, కుప్పం, పలమనేరు, తిరుపతి జిల్లాలో తిరుపతి, గూడూరు, పాకాల, సత్యవేడు, తొట్టంబేడు, చంద్రగిరి, వాకాడు సబ్‌ట్రెజరీ కార్యాలయాలున్నాయి. అక్కడే స్ట్రాంగ్‌రూమ్‌లు కొనసాగుతున్నాయి. వాటి భద్రత కోసం రోజూ 24 గంటల పాటు షిఫ్టుల కింద పోలీసు గార్డు కాపలా ఉంటుంది. ఇందుకోసం పోలీసు శాఖ ఖజానా రూ.లక్షల్లో చెల్లిస్తోంది.

ఎట్టకేలకు జిల్లా కమిటీ ఏర్పాటు

ఏళ్ల తరబడిగా నిద్రమత్తులో ఉన్న ఖజానాశాఖ ఇప్పుడిప్పుడే మేల్కొంది. తిరుపతి, ఉమ్మడి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆయా జిల్లాల జేసీల అధ్యక్షతన ఖజానాశాఖ డీడీ కార్యదర్శిగా 10మంది జిల్లా అధికారులతో జిల్లా కమిటీ ఏర్పడింది. అన్ని జిల్లా, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ఇప్పటివరకు భద్రపరిచిన వస్తువులను ప్రభుత్వశాఖల వారీగా జాబితా తయారు చేయాలి. ఆ తర్వాత వాటి వివరాలను ఆయా శాఖల అధికారులకు తెలియజేయాలి. అక్కడ ముఖ్యమైన వాటిని నిల్వచేసి, అనవసరమైన వాటిని అధికారుల సహకారంతో తొలగిస్తారు. ఈ ప్రక్రియ అంతా ఈ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు జిల్లా కమిటీ తరచూ సమావేశం కానుంది.

పెనాల్టీ వసూలు చేయని ఖజానా శాఖ

ఖజానా స్ట్రాంగ్‌రూమ్‌లో తమ వస్తువులను ఆయా శాఖలు మూడేళ్ల పాటు భద్రపరచుకోవచ్చు. ఆ తర్వాత వాటిని వెనక్కు తీసుకెళ్లాలి. లేదంటే ప్రతి వస్తువుపై ఏడాదికి రూ.25 చొప్పున పెనాల్టీ విధించి ఖజానా అధికారులు వాటిని ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి. అయితే ఇప్పటివరకు పైసా కూడా పెనాల్టీ రూపంలో వసూలు చేయలేదు. గత 20-25 సంవత్సరాల నుంచి ఖజానాశాఖలో నిల్వలు పేరుకుపోతున్నాయి. లోపల అడుగు పెట్టేందుకు కూడా చోటు లేదు.

'రా... కదలిరా' బహిరంగ సభ వాయిదా

చిత్తూరు సిటీ, జనవరి 16: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో నిర్వహించ తలపెట్టిన 'రా.. కదలిరా' బహిరంగ సభ వాయిదా పడినట్లు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధానకార్యదర్శి కోదండయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 'రా...కదలిరా' బహిరంగ సభ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈనెల 19న జీడీనెల్లూరు నియోజకవర్గంలో నిర్వహించాల్సిన బహిరంగ సభ అనివార్యకారణాలవల్ల వాయిదా వేసినట్లు వారు ఆ ప్రకటనలో తెలిపారు.

తమిళ మందుబాబుల సందడి



బలిజకండ్రిగలోని ప్రభుత్వ మద్యం షాపువద్ద రద్దీ

కనుమ సందర్భంగా తమిళనాడులో మద్యం షాపులు మూసేయడంతో సరిహద్దుల్లోని పాలసముద్రం మండలం బలిజకండ్రిగ మద్యం షాపు మంగళవారం కిటకిటలాడింది. ఉదయం నుంచే రద్దీ పెరగడంతో మద్యం దుకాణాల ఎదుట పోలీసులు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. రోజుకు లక్షా లక్షన్నర రూపాయల అమ్మకాలు జరిగే ఈ షాపులు అయిదారు లక్షల మద్యం హాట్‌కేకుల్లా అమ్ముడైపోయింది. నిజానికి తమిళనాడు కంటే ఇక్కడ మద్యం ధరలు ఎక్కువ. అయినా తమిళనాడు మందుబాబులు ఎగబడ్డారు.

- పాలసముద్రం

దొరికిన కోడి.. దొరికినట్లు..!

నెల్లూరు జిల్లాలో మినీ లారీ బోల్తా
నలుగురికి గాయాలు

కోళ్ల లారీ బోల్తాపడి, గాయపడి కొందరు బాధపడితే.. జన మేమో రోడ్డుపై పడిన కోళ్ల కోసం పరుగు తీశారు. దొరికింది దొరికినట్లు పట్టుకెళ్లి 'పండుగ' చేసుకున్నారు. ఈ ఘటన నెల్లూరు జిల్లా మనుబోలులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు నుంచి 1080 కోళ్లతో మినీలారీ నెల్లూరుకు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున మనుబోలు వంతెన వద్ద ఈ కోళ్లలారీని మరో లారీ అధిగమించి ముందుకు వచ్చి హఠాత్తుగా బ్రేక్ వేసింది. దీంతో కోళ్లలారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుజిత్, క్లీనర్ సందీప్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కోళ్ల లారీ బోల్తా పడిందన్న విషయం తెలియగానే స్థానికులంతా హైవే పైకి చేరుకున్నారు. సందట్లో సడేమియా అంటూ చేతికి చిక్కినన్ని కోళ్లను పట్టుకెళ్లారు. కాగా, మిగిలిన కోళ్లను మరోలారీలో ఎక్కించి నెల్లూరుకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- మనుబోలు



లారీ నుంచి కోళ్లు పట్టుకెళుతున్న స్థానికులు



ఇందుశేఖర్‌కు చంద్రబాబు ఆహ్వానం

చంద్రగిరి, జనవరి 16:టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొల్లూరు ఇందుశేఖర్ సాదర వీడ్కోలు పలికారు.సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామమైన నారావారిపల్లెకు వచ్చిన చంద్రబాబు మంగళవారం సాయంత్రం తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా తనను ఒకసారి విజయవాడకు వచ్చి కలవాల్సిందిగా చంద్రబాబు చెప్పారని ఇందుశేఖర్ తెలిపారు.

కన్నులపండువగా
పార్వేట ఉత్సవం



తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పార్వేటఉత్సవం కన్నులపండువగా జరిగింది.మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మలయప్పస్వామి తిరుచ్చిలో పార్వేటమండపానికి వేంచేశారు. స్వామి వెంట మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి కొలువుదీరారు.ఉభయదారులకు, తాళ్లపాక వంశీయులకు, మఠంవారికి మర్యాదలు చేశాక శ్రీకృష్ణస్వామిని సన్నిధి యాదవ పూజ చేసిన ప్రదేశానికి వేంచేపు చేసి పాలు, వెన్న, హారతులు సమర్పించారు.మలయప్పస్వామి సహా అర్చకులు ముందుకు కొంతదూరం పరుగెత్తి బడిసెను విసిరి వెనక్కు వచ్చారు. ఇలా మూడుసార్లు జరిగింది. మలయప్పస్వామి తిరిగి ఆలయ మహద్వారం వద్దకు చేరుకుని హథీరాంజీ మఠంవారి బెత్తాన్ని తీసుకుని సన్నిధిలోకి వేంచేశారు.టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకున్న ఆమెను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



తిరుమల ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో జస్టిస్ జ్యోతిర్మయి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే
ఏపీకి విభజన హామీలు అమలు
తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):'రాష్ట్ర విభజన అనేది అనివార్యం. ఆనాడే ఏపీకి అవసరమైన ప్రత్యేక హోదా, ఇతర అభివృద్ధి అంశాలతో హామీలు ఇచ్చాం. ఆ దిశగానే అప్పటి ప్రధాని కూడా హామీ ఇచ్చారు. కానీ ఆనాడు ఉన్నవాళ్లు ఒప్పుకోలేదు. కేంద్రంలో, ఏపీలో మా పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి రావాల్సిన విభజన హామీలు అమలు చేస్తాం' అని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణాతో పాటు ఏపీ కూడా బాగుండాలనే విధంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఉన్న వ్యతిరేక భావన తొలగిపోయిందన్నారు. విభజనతో పాటు అభివృద్ధి కూడా జరగాల్సి ఉన్నప్పటికీ జరగలేదన్నారు. ఇక, ఏపీలో ఎన్నికల అంశంపై మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనని, పార్టీ నిర్ణయం మేరకు ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ప్రచారం కోసం తిరిగానన్నారు. తప్పకుండా ఏపీలో కూడా కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వమని ప్రజలను కోరుకుంటామన్నారు.కాంగ్రెస్‌కు కొత్త ఓట్లు వస్తాయా, లేక వైసీపీ, టీడీపీ ఓట్లు వస్తాయా అనేది భవిష్యత్తు నిర్ణయిస్తుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.



తిరుమల ఆలయం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్

2 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు

చిత్తూరు సిటీ, జనవరి 16: ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 2వ తేది వరకు జాతీయరహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీటీసీ నిరంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 'యువశక్తి ద్వారా సామాజిక మార్పు' నినాదంతో మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బస్సు, లారీ, ఆటో డ్రైవర్లకు, కళాశాల విద్యార్థులకు, ముఖ్యమైన కూడళ్లలో సమావేశాలు ఏర్పాటుచేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు.

బంగారుపాళ్యం మాజీ జమీందారు మృతి

బంగారుపాళ్యం, జనవరి 16: బంగారుపాళ్యంలో మంగళవారం ఉదయం మాజీ జమీందారు ఎంబీ సుబ్బరామరాజ (87) కన్నుమూశారు. ఈయన 1962 నుంచి 1988 వరకు బంగారుపాళ్యం మేజర్ పంచాయతీ సర్పంచిగా 25సంవత్సరాలు కొనసాగారు. బ్రిటీష్ కాలంలో టిర్కాకా డెవలప్‌మెంట్ కమిటీ బంగారుపాళ్యంకు చైర్మన్‌గా ఉన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ పాఠశాల, మొగిలేశ్వర కల్యాణ మండపానికి స్థలదాత కూడా ఈయనే. మొగిలేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా కూడా కొనసాగుతున్నారు. దొరచెరువు పునర్నిర్మాణానికి అప్పట్లోనే ఆర్థికసాయం అందించారు. చిత్తూరులోని బీజడ్ స్కూల్ కరస్పాండెంట్‌గా 1961 నుంచి కొనసాగుతున్నారు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీలో డైరెక్టర్‌గానూ ఉన్నారు. ఈయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన పార్థివదేహానికి పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, వైసీపీ రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ ఎం.బి.కుమార్‌రాజా, మండల వైసీపీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, వైసీపీ నాయకులు విద్యారెడ్డి, కృపాసాగర్ రెడ్డి, నారే సోమశేఖర్, దత్తాత్రేయ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారుడు ఎంబీ విజయకుమార్ తెలిపారు.



సుబ్బరామరాజ (ఫైల్‌ఫొటో)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నలుగురు వేటగాళ్ల అరెస్టు
మూడు నాటు తుపాకులు స్వాధీనం

బంగారుపాళ్యం, జనవరి 16: అటవీ జంతువుల కోసం పేల్చిన నాటు తుపాకీ గుండు తగిలి ఓ వ్యక్తి మృతిచెందిన కేసులో పోలీసులు నలుగురు వేటగాళ్లను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు నాటు తుపాకీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సోమవారం మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. మేత కోసం వెళ్లిన ఎద్దు తిరిగి రాకపోవడంతో బంగారుపాళ్యం మండలం ఎగువ కంతలచెరువుకు చెందిన ఉమాపతి శుక్రవారం రాత్రి దానిని వెతుకుతూ వెళ్లారు. నాగాలపురం గ్రామ సమీపంలోని తూర్పు అటవీ ప్రాంతంలో ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో వన్యమృగాలను వేటాడుతున్న నాగరాజు.. చీకట్లో అలికిడి విని ఏదో అడవి జంతువని భావించి నాటు తుపాకీతో కాల్చారు. ఆ గుండు తగిలి ఉమాపతి మృతిచెందారు. మృతుడి అన్న శరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం నాగాలపురం క్రాస్ వద్ద ఉన్న నాగరాజు (నాగాలపురం), ఎగువకంతల చెరువుకు చెందిన వెంకటేష్, పాండియన్, శేఖర్ (ఎగువకంతల చెరువు)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామన్నారు. ఎవరైనా వన్యమృగాలను వేటాడినా, కరెంటు తీగలు లాగినా చట్టరీత్యా నేరమని తెలిపారు. గ్రామస్తులెవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో సీఐ నాగరాజరావు, ఏఎస్ఐ మల్లప్ప, సిబ్బంది ఉన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ సుధాకర్ రెడ్డి





కుప్పంలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు - పలమనేరులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

కుప్పంలో కోటి సంతకాల వేడి

కుప్పం, జనవరి 16: కుప్పంలో అంగన్వాడీల ఉద్యమం తీవ్ర రూపం తీసుకుంటోంది. భోగి, సంక్రాంతి, కనుమ పర్వాలలో సైతం దీక్షలను కొనసాగించారు. సంక్రాంతి నాడు పట్టువిడవ కుండా దీక్షా శిబిరంలోనే గడిపిన అంగన్వాడీలు, కనుమ పండుగ రోజైన మంగళవారం కోటి సంత కాలను సేకరణకు నడుంబిగించారు. 'జగనన్నకు చెబుదాం' పేరుతో తమ డిమాండ్ల సాధనకు ప్రజల నుంచి మద్దతుగా సంతకాలు సేకరించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐయూటీ నాయకురాలు లలిత ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని అణచివేత చర్యలకు ప్రభుత్వం పాల్పడినా సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు.

పలమనేరు: సీఎం జగన్ నియంతలా వ్యవహరి స్తున్నారని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పలమనేరులో అంగన్వాడీలు ఆందోళన కొనసాగించారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఓబుల్ రాజు, గిరిధరమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రాధ, ఆయాలు పాల్గొన్నారు.

వైభవంగా కైలాసగిరి ప్రదక్షిణ

- వివాహ వేడుకకు దేవగణాలను ఆహ్వానించిన పార్వతీ పరమేశ్వరులు

శ్రీకాళహస్తి జనవరి 16 : శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ సంబరం అంబరాన్ని తాకింది.తమ కళ్యాణ మహోత్సవానికి దేవగణాలను శివపార్వతులు ఆహ్వానించే వేడుకకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో శివపార్వతుల కల్యాణ వేడుక వైభవంగా జరుగుతుంది.ఈ వేడుకకు రావాలంటూ పరమశివుడు సతీసమేతుడై కనుమ పండుగ రోజున దేవగణాలకు ఆహ్వానం పలుకుతారు.ఇందులో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణగా వెళ్లి దేవగణాలకు ఆహ్వానం అందజేశారు.సోమవారం త్రిశూలం,పల్లకి గిరి ప్రదక్షిణ జరిగింది.మంగళవారం అర్చకులు అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.భక్తుల శివనామ స్మరణ మధ్య స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణ ఉదయం 7.30గంటలకు ఆలయం నుంచి మొదలైంది.వివిధ వాయిద్యాలు,కోలాట నృత్యాల నడుమ పార్వతీ పరమేశ్వరులతో పాటు వేలాది మంది భక్తులు వెంట నడిచారు.విడిది మండపాల వద్ద స్వామి అమ్మవార్లను కొలువుదీర్చగా స్థానిక ఉభయ దారులు నైవేద్యాలు సమర్పించారు.దాతలు పెద్దసంఖ్యలో మంచినీళ్లు,మజ్జిగ,శీతల పానీయాలు, అన్నప్రసాదాలు అందించారు. కైలాసగిరి రిజర్వాయర్ ఎదురుగా అంజూరు వారి మండపం వద్ద ముక్కంటి ఆలయం తరఫున భక్తులకు అన్నదానం చేశారు. చైర్మన్ శ్రీనివాసులు, ఈవో రామారావు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. గిరి ప్రదక్షిణకు హాజరు కానివారు పట్టణ శివారులోని శుకబ్రహ్మాశ్రమం వద్దకు సాయంత్రం వేలాదిగా తరలివచ్చారు. స్వామి అమ్మవార్లు తిరిగి వచ్చేలోపు స్వర్ణముఖి నదిలో పిల్లలు పెద్దలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు.కోనేటి మిట్ట ప్రాంతంలోని ఎదురు సేవ మండపం వద్దకు స్వామి అమ్మవార్లు రాగా ప్రత్యేక పూజలు చేసి నైవేద్య హారతులను సమర్పించారు. ఈ ఎదురు సేవలో ఎంపీ గురుమూర్తి , ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.ఇక్కడి నుంచి ముక్కంటి ఆలయం వరకూ స్వామి అమ్మవార్లు ఊరేగి గిరి ప్రదక్షిణకు స్వస్తి పలికారు. రాత్రి స్వామి అమ్మవార్లు అశ్వసింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



గిరి ప్రదక్షిణలో ఊరేగుతున్న స్వామి అమ్మవారు

పండుగ క్రికెట్ వివాదం
సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై హత్యాయత్నం

గంగవరం, జనవరి 16: క్రికెట్‌మ్యాచ్ ఆగిపోవడానికి నీవే కారణమంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని వెంటాడి రాడ్లు, బ్యాట్లతో దాడి చేశారు. ఈ గంగవరం మండలం మార్జేపల్లె సమీపంలో సోమవారం చోటు చేసుకొంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మార్జేపల్లెకు చెందిన రెడ్డెప్ప రెడ్డి కుమారుడు సూర్యప్రకాష్ (21) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్నారు. సంక్రాంతి పండుగ కోసం రెండు రోజుల కిందట ఇంటికి వచ్చారు. యువకులందరూ కలసి సరదాగా క్రికెట్ ఆడాలని కోరడంతో గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. చెరువు వద్ద మార్జేపల్లె, పనపత్తూరు కురపల్లె, వీరశెట్టిపల్లె గ్రామాలకు చెందిన యువకులు జట్లుగా ఏర్పడి క్రికెట్ మ్యాచ్‌లు ఆడటం మొదలుపెట్టారు. మ్యాచ్ జరుగుతుండగా ఆట మధ్య ఒక ప్లేయర్ రనౌట్ కావడంతో, బ్యాటింగ్ జట్టు నాటౌట్ అని, బౌలింగ్ జట్టు ఖచ్చితంగా ఔట్ అని వాదించుకున్నారు. రెంటు జట్లకు చెందిన వాళ్ల పంతాలు పట్టింపులకు పోయి తాము ఒప్పుకోమంటే ఒప్పుకోం అంటూ భీష్మించుకోవడంతో మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోయింది. మ్యాచ్ ఆగిపోవడంతో సాఫ్ట్‌వేర్ యువకుడు సూర్యప్రకాష్ ద్విచక్ర వాహనంపై మరో స్నేహితుడితో కలసి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రత్యర్థి జట్టు సభ్యులు కొంతమంది బ్యాట్‌లు, క్రికెట్ స్టిక్స్, రాడ్లతో సూర్యప్రకాష్‌ను వెంబడించి అడ్డుకున్నారు. ద్విచక్రవాహనాన్ని బలవంతంగా ఆపి, వెనుక కూర్చున్న సూర్యప్రకాష్ స్నేహితుడిని ముగ్గురుగట్టిగా పట్టుకోగా, మరో ఏడుగురు యువకులు సూర్యప్రకాష్‌పై బ్యాట్‌లు, స్టిక్‌లు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలైన అతడు సొమ్మసిల్లిపడిపోయారు. దాడిచేసిన వారు పరారవగా, స్థానికులు గుర్తించి గాయపడిన సూర్యప్రకాష్‌ను హుటాహుటిన పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుడిపాల సీఎంసీకి.. అక్కడ్నుంచి రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సూర్యప్రకాష్ తమపై దాడి చేశారని ప్రత్యర్థి వర్గానికి చెందినవారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. తీవ్రగాయాలైన సూర్యప్రకాష్ ఫిర్యాదు ఇంకా అందలేదని, ఈగొడవపై కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

షర్మిల నియామకం శుభపరిణామం

వెదురుకుప్పం, జనవరి 16: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా (పీసీసీ) వైఎస్ షర్మిల నియామకం శుభ పరిణామమని జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తెలిపారు. వెదురుకుప్పంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. షర్మిల నియామకంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందన్నారు. తాజా మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించడం కూడా శుభ పరిణామమని పేర్కొన్నారు.

శ్రీవారి ఆలయంలో తిరిగి మొదలైన సుప్రభాతం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ తిరిగి మొదలైంది. పవిత్రమైన ధనుర్మాసం ఆదివారంతో ముగియడంతో సోమవారం వేకువజాము నుంచి శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ పునఃప్రారంభమయ్యింది. గతేడాది డిసెంబరు 17వ తేదీ తెల్లవారుజాము నుంచి ధనుర్మాస ఘడియలు ప్రారంభమైన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. అయితే జనవరి 14వ తేదీతో ధనుర్మాస ఘడియలు పూర్తికావడంతో 15వ తేదీ నుంచి యథాప్రకారం ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహించారు.

హుండీ ఆదాయం రెండ్రోజుల్లో రూ.7.02 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా ఆదాయం రెండ్రోజుల్లో రూ.7.02 కోట్లు లభించింది. ఆదివారం రూ.3.13 కోట్లు, సోమవారం రూ.3.89 కోట్లు లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,964 మంది, సోమవారం 86,107 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ రెండ్రోజుల్లో 57,506 మంది స్వామివారికి తలనీలాలు సమర్పించారు.

టీటీడీకి ఆర్గానిక్ నెయ్యి విరాళం

శ్రీవారికి రూ.22 లక్షల విలువైన ఆర్గానిక్ నెయ్యి సోమవారం విరాళంగా అందింది. పుణెకి చెందిన పరాగ్ ఫుడ్స్ సంస్థ ఆధ్వర్యంలోని భాగ్యలక్ష్మి డెయిరీ వెయ్యి కేజీల ఆర్గానిక్ నెయ్యిని అందించింది. సంస్థ చైర్మన్ దేవేందర్ షా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అక్షాలీషా తరుపున పలమనేరులోని భాగ్యలక్ష్మి డెయిరీ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ నక్రా బృందం ఈ విరాళాన్ని శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, పడిపోటు సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి అందజేసింది.

తిరుమల వేంకటేశ్వరుడికి గోదామాలలు



గోదాదేవి మాలలతో జీయర్‌స్వాములు

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మహా భక్తురాలైన గోదాదేవి పరిణయోత్సవం పురస్కరించుకుని గోదామాలలను శ్రీవారి మూలవిరాట్‌కు మంగళవారం ఉదయం సమర్పించారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ గోదాదేవి చెంత నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. మాలలు తిరుపతి నుంచి తిరుమల పెద్దజీయర్‌స్వామి మఠానికి మంగళవారం ఉదయం చేరుకున్నాయి. అనంతరం మఠం నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో పూజా కార్యక్రమాలయ్యాక మూలవిరాట్టుకు అలంకరించారు. జీయర్ స్వాములు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైదికోక్తంగా 'కాకబలి'

శ్రీవారి ఆలయంలో ప్రతి ఏడాది కనుమ పండుగను పురస్కరించుకుని ఉదయాత్పూర్వం నిర్వహించే 'కాకబలి' కార్యక్రమం మంగళవారం వైదికోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా అర్చకస్వాములు.. పసుపు, కుంకుమ వేర్వేరుగా కలిపిన అన్నాన్ని ఆనంద నిలయం విమాన వేంకటేశ్వరస్వామికి నివేదించారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

భోగి మంటల్లో బకాయి జీవోలు



పలమనేరు, జనవరి16 : బకాయి జీవోలను ఉపాధ్యాయులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. మంగళవారం యూటీఎఫ్ డివిజన్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు భోగి మంట వేశారు. పెండింగ్ సమస్యలను సంబంధించిన జీవోలను ఆ మంటల్లో కాల్చి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన రూ. 18వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి జీవీ రమణ, రాష్ట్ర కౌన్సిలర్ సీపీ ప్రకాష్, జిల్లా నాయ కులు ప్రసన్నకుమర్, క్రిష్ణమూర్తి, బాబు, డివిజన్ నాయకులు గురు మూర్తి, బషీర్ అహమ్మద్, వేమచంద్రారెడ్డి, రామ్మోహన్, కోదండరెడ్డి, రాజేష్‌రెడ్డి, గురునాథం, శేఖర్, మునిరాజు, సుబ్రమణ్యం, భానుమూర్తి, ప్రత్యూష పాల్గొన్నారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు



ప్రథమ బహుమతి దక్కించుకున్న ముగ్గు

సోమల, జనవరి 16: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. శెట్టివారివీధిలో బోయ కొండమ్మ గంగమ్మ వెలుగు గ్రూపు ఆధ్వర్యంలో పోటీలలో ప్రథమ బహుమతిని ఎస్.స్వప్న రూ. 10వేలు, ద్వితీయ బహుమతిని మానస, రూ.7 వేలు, తృతీయ బహుమతిని భావన రూ. 5వేలు దక్కించుకున్నారు. అలాగే కరకమంద చెన్నమల్లయ్య ఆలయ కమిటీ సభ్యులు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కమ్మపల్లెలో మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

క్రికెట్ టోర్నీ విజేత వి.కోట హరి ఎలెవన్



విజేతలకు ట్రోఫీ. నగదు బహుమతులు అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జనవరి 16: తెలుగుయువత ఆధ్వర్యంలో రామకుప్పం మండలం పంద్యాలమడుగులో మూడు రోజులుగా నిర్వహించిన ఎన్టీయార్ స్మారక క్రికెట్ టోర్నీ విజేతగా వి.కోట హరి ఎలెవన్ జట్టు నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో పంద్యాలమడుగు జట్టు రన్నరప్‌గా నిలిచింది. విన్నర్స్‌కు, రన్నర్స్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, మహ్మద్‌రఫీ, నందారెడ్డి, మునిరాజు, భాస్కర్, కృష్ణానాయక్, హరి, సుధాకర్‌నాయక్, ఉమేష్‌గౌడు, బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి



వెంకటరత్నం (ఫైల్‌ఫోటో)

కల్లూరు, జనవరి 16: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి కథనం మేరకు.... గ్రామానికి చెందిన మద్దిలి వెంకటరత్నం (58) మంగళవారం మధ్యాహ్నం పశువులకు మేపేందుకు గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలంవద్దకు తోలుకెళ్లాడు. పశువులను మేపుతున్న క్రమంలో బావి ఒడ్డున కూర్చొని ఉండగా అదుపుతప్పి బావిలో పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు ఆయన్ను వెలికితీశారు. ప్పటికే ఆయన మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటాపోటీగా సాగిన క్రికెట్ టోర్నీలు



సోమలలో క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకుల

సోమల, జనవరి 16: సోమల మండలంలో సంక్రాంతి పండుగ సంబరాలు పురస్కరించుకుని జరిగిన క్రికెట్ టోర్నీల్లో మంగళవారం ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. సోమల హైస్కూల్లో శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో విజేతగా నిలిచిన కలికిరి టీమ్ రూ.30వేలు నగదు, ట్రోఫీని దక్కించుకుంది. రన్నర్స్‌గా నిలిచిన శివాలయం రాయల్స్ టీమ్ రూ. 20 వేలు, శివాలయం రాయల్స్ సీ టీమ్ తృతీయ బహుమతిగా రూ. 10వేలు అందుకున్నాయి. టోర్నీ నిర్వహణకు భోజన సౌకర్యం కల్పించిన కామిశెట్టి నగేశ్‌ను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, విశాంత్ర ఎల్ఐ వెంకటరమణ, జగన్ మోహన్, వీవీ రమణ, శ్రీరాములు, బీవీఎస్ సుబ్రహ్మణ్యం, నరేంద్రబాబు, కే.నగేశ్, పీడీ కరుణానిధి, శంకర్‌రెడ్డి, దామోదరం, టీ. సోమశేఖర్, పీఎస్ బాబు, సూర్యప్రకాశ్, భాస్కర్, డీ.సునీల్, అభిషేక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో ఘనంగా స్వచ్ఛ తీర్థ కార్యక్రమం

ఐరాల(కాణిపాకం), జనవరి 16: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బస్టాండ్, వంద అడుగుల రోడ్డు, మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరిండెంటెంట్ కోదండపాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గిరి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం: మహిళ అరెస్టు

బంగారుపాళ్యం, జనవరి 16: మండలంలోని కాటప్పగారిపల్లె వద్ద ఎస్ఈబీ అధికారులు మంగళవారం జరిపిన దాడుల్లో కర్ణాటక మద్యం కలిగి వున్న శిల్ప అనే మహిళను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆమె వద్ద 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ క్రీడలకు పునరుజ్జీవం తేవాలి

యాద మరి, జనవరి 16: అంతరించి పోతున్న గ్రామీణ క్రీడలకు పునరుజ్జీవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నెహ్రూ యువకేంద్ర అకౌంట్స్ ఆఫీసర్ బాబురెడ్డి అన్నారు. స్వామివివేకానంద జయంతోత్సవాలను పురష్కరించుకుని మండలంలోని కీనాటంపల్లెలో యువనోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు క్రీడలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో హరినాయుడు, మునిచంద్ర నాయుడు, కిసాన్ యువజన సంఘం అధ్యక్షులు కిరణ్‌కుమార్ పాలొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలస్వామి



కార్వేటినగరం, జనవరి 16: టీటీడీ అనుబంధ ఆలయమైన వేణుగోపాల స్వామిని కనుమ పండగ సందర్భంగా పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కర్పూర హారతి నీరాజనాలు అర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

బాబుతోనే బీసీలకు భవిష్యత్తు



వసనాడులో ప్రచారం చేస్తున్న శాంతారాం

కుప్పం రూరల్, జనవరి 16: బీసీల భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడివుందని ఆ పార్టీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు వైద్యం శాంతారాం అన్నారు. మండ లంలోని వసనాడు గ్రామంలో ఆయన కనుమ పండుగ రోజైన మంగళవారం కుటుంబంతో కలిసి బీసీ భరోసా పేరిట చంద్రబాబు ప్రకటించిన పథకాలను ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



రామకుప్పం, జనవరి 16: రామకుప్పం మండలం మణీంద్రం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సుబ్రహ్మణ్యం తల్లి మునెమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నేతలు శ్రీరాములురెడ్డి. వెంకటరమణ, జ్ఞానశేఖర్‌రెడ్డి, నాగరాజు, మంజునాథరెడ్డి తదితరులు మునెమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, జనవరి16: పుంగనూరు- రామసముద్రం మార్గంలోని పత్తిమ్మగారిపల్లె క్రాస్ వద్ద ఐషర్ వాహనం (టెంపో) ద్విచక్ర వాహనాన్ని ఢీకొడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. మండలంలోని ఏటవాకిలి పంచాయతీ పత్తిమ్మగారిపల్లెకు చెందిన కదిరెప్ప కుమారుడు శివకుమార్(25) ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉండగా రామసముద్రం వైపు నుంచి వచ్చిన ఐషర్ వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. ప్రయాణికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోగుల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సరళమ్మ

పుంగనూరు, జనవరి16: రోగులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషర్ డాక్టర్ సరళమ్మ హెచ్చరించారు. సోమవారం ఆమె పుంగనూరు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోగులతో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖరరెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ శరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అనురాధ, సిబ్బంది భారతి, మధుబాల తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

సదుం, జనవరి 16: రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సరళమ్మ సదుం సీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచించారు. సదుం సీహెచ్‌సీని సోమవారం ఆమె తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, వైద్య సేవల నిర్వహణ రికార్డులు, వివిధ విభాగాల్లోని వైద్య పరికరాలను ఆమె పరిశీలించారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తామని, అలాగే ఖాళీ పోస్టుల భర్తీకి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో ఆమె వెంట డీసీహెచ్ఎస్ రాజశేఖరరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.పుష్పకుమారి, సీహెచ్ఎస్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, వైద్యులు శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

రంగవల్లుల్లో 'సూపర్ సిక్స్'



ఉచిత సిలిండర్ల ముగ్గు, ఇంటింటికీ మంచినీటి ముగ్గు, ఉచిత బస్సు ప్రయాణం అంటూ తీర్చిదిద్దిన రంగవల్లి

కుప్పం, జనవరి 16: కుప్పంలో మహిళలు కనుమ పర్వాన్ని వినూత్న రీతిలో జరుపుకున్నారు. పాడిపంటలకు ఆధారమైన పశువులకు పూజలు జరిపి హారతులివ్వడమే కాదు, రంగవల్లులు తీర్చిదిద్ది తమ ఎమ్మెల్యే, టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మీద అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను రంగవల్లులకు జోడించి అద్భుతంగా ఇళ్ల ముంగిట తీర్చిదిద్దారు. ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు సిలిండర్లు, ఇంటింటికీ రక్షిత మంచినీరు, ప్రతి మహిళకూ ఉచిత బస్సు ప్రయాణం పథకాలను సూచించేలా సిలిండర్లు, కుళాయి, బస్సు తదితర రూపాలను రంగుల్లో తీర్చి, ఆయా పథకాలను గురించి అదే రంగుల్లో అందంగా రాసి అలరించారు. ఈ సూపర్ సిక్స్ రంగవల్లులను చూసిన తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు తదితరులు ఆ మహిళలను అభినందనలతో ముంచెత్తారు.

అరాచక పాలనకు స్వస్తి పలకండి :చల్లా బాబు



సమావేశంలో మాట్లాడుతున్న చల్లారామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జనవరి 16: రాష్ట్రంలో అరాచక పాల నకు స్వస్తి పలకాలని టీడీపీ పుంగనూరు నియో జకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తన స్వగృహం వద్ద సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండల నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు గ్రామ, మండల, నియోజకవర్గం క్లస్టర్ యూనిట్ ఇన్ చార్జిలతో సమావేశం నిర్వహించారు. బాబు ష్యూ రిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంపై మండలాల వారీగా సమీక్షించారు. వైసీపీ వైఫల్యా లను మరింత వేగంగా స్పష్టంగా జనంలోకి తీసు కెళ్లాలని సూచించారు. ఈ నెల 24వ తేదీ అన్న మయ్య జిల్లా పీలేరులో జరిగే 'రా.. కదిలా రా' కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అలాగే సోషియల్ మీడియాలో తప్పుడు సమాచారంతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఇందు కోసం పార్టీ సోషల్‌మీడియా మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. మంత్రి పెద్దిరెడ్డి చేస్తున్న ఆగడాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు కక్షసాధింపు చర్యలు ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. అయితే పోలింగ్ ముగిసే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడురుహరిబాబు, రొంపిచెర్ల మండల అధ్యక్షులు ఉయ్యాల రమణ, సుబ్రమణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, రాష్ట్ర టీడీపీ నాయకులు అంజాద్‌ఖాన్, ముల్లంగి వెంకట్రమణ, రాజంపేట పార్లమెంట్ నాయకులు షేక్ కరీముల్లా, ఇమ్రాన్ ఖాన్, నాయకులు నాగిశెట్టి నాగరాజ, సహదేవ, జనసేన నాయకులు చిన్న, రెడ్డి శేఖర్, నాయకులు రవికుమార్‌నాయుడు, సిద్ధయ్య, శివశంకర్, చిన్నబాబు, సూరిశెట్టిసురేంద్ర, రామ మూర్తి, మదనారెడ్డి, అమరనాథరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మకరజ్యోతి దర్శనం



కుటుంబసభ్యులతో తిరువాభరణాలను తీసుకెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం, జనవరి 14: ఎర్రాతివారిపల్లె బురుజు కొండపై కొలువై ఉన్న అయ్యప్పస్వామి ఆలయ సన్నిదానం నుంచి భక్తులకు మకరజ్యోతి దర్శన భాగ్యం కలిగింది. ఆలయ ధర్మకర్త, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మకరజ్యోతి దర్శన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక సదుం ఎల్లమ్మ దేవత ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కేరళ సంప్రదాయ వాయిద్యాల నడుమ మంత్రి తిరువా భరణాలను స్వామివారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు నంబూద్రి నారాయణన్ ఆభర ణాలతో స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయం సంధ్య వేళ 'స్వామియే శరణం అయ్యప్ప' అన్న భక్తుల శరణుఘోషల నడుమ ఆలయ తూర్పు దిశలోని కొండలపై వినీలాకాశంలో కనుల విందుగా మకర జ్యోతి దర్శనమివ్వడంతో భక్తులు ఆనంద పరవశుల య్యారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న దానం చేశారు. చౌడేపల్లె రూరల్ సీఐ కృష్ణారెడ్డి, సదుం, సోమల ఎస్ఐలు తమ సిబ్బం దితో భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

ఇరుముడుల చెల్లింపు

మండలం రోజులు అయ్యప్ప దీక్షలో ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి సోమవారం స్వామి వారికి ఇరుముడులు చెల్లించారు. అలాగే ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రెడ్డెప్ప, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంఎల్‌సీ భరత్, పూతలపట్టు ఇన్‌ఛార్జ్ డా.సునీల్‌కుమార్, మదనపల్లె ఇన్‌చార్జ్ నిసార్ అహ్మద్ తదితరులు దర్శించుకున్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కరువు: టీడీపీ



ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జనవరి 16: రాష్ట్రంలో వైసీపీ పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి, సంక్షేమం కరువైందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, గాండ్ల, తెలికుల సమితి రాష్ట్ర సభ్యుడు వేలూరిజగన్నాథం, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజినేయరెడ్డిలు తెలిపారు. ఈ నెల 23న రామకుప్పంలో జరిగే జయహో బీసీ సభ ప్రచార రథాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, ఆదరణ పనిముట్ల పంపిణీ ఆగిపోయిందన్నారు. అంతేగాకుండా బీసీలపై దాడులు, హత్యలు, మానబంగాలు పెరిగాయన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలు ప్రశాంతంగా జీవించగలరని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు సీతాపతి, రామకృష్ణప్ప, నందారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, టీవీరవి, జ్ఞానశేఖర్‌రెడ్డి, భానుమూర్తి, బాలరాజు, సుబ్రీ, శంకర్, మంజునాథ్, మోహన్, అల్లీశీను, మురళీ, దయానంద, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిధిలో మంత్రి పెద్దిరెడ్డి

కల్లూరు, జనవరి 16: పులిచెర్ల మండలం పాళెం ఆనందగిరి కొండపై వెలసిన అయ్యప్ప స్వామిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. ముందుగా మంత్రి గణనాథుడికి పూజలు చేశారు. తర్వాత అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం మకరజ్యోతి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు నాథమునిరెడ్డి, నాయకులు మునీశ్వర్, మునస్వామి పాల్గొన్నారు.

కమ్మ కులంలోని పేదల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నేతలు

కల్లూరు, జనవరి 16: కమ్మ కులంలోని పేదల అభ్యున్నతికి సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం నాయకులు పార్థసారధినాయుడు, గోపినాయుడు, ధనంజయనాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి సమీపంలోని మామిడితోటలో మంగళవారం కమ్మ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సంఘం నాయకులు గిరినాయుడు, సాగర్, పరందామనాయుడు, నవీన్, శరత్, భాస్కర్‌నాయుడు, పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలతో పాఠశాలకు గుర్తింపు



వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సోమల, జనవరి 16: నంజంపేట హైస్కూల్ స్వర్ణోత్సవ వేడుకలతో పాఠశాల గుర్తింపు పొందిందని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నంజంపేట హైస్కూల్లో జరిగిన స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాఠశాలలో ఆడిటోరియం నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంఈవో శివరత్న, విశ్రాంత హెచ్ఎం రంగారెడ్డి, ఎంపీటీసీ జిన్నా, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్, హెచ్ఎం కుసుమాంబ, మాజీ ఎంపీపీ ఝాన్సీ లక్ష్మీ, విద్యార్థి సంఘ నాయకులు నాగభూషణం, గోపీ నాయక్, మునీశ్వరరావు, మునిరాజ, శ్రావణ్ కుమార్, భానుప్రకాశ్, మహబూబ్ బాషా, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గిరిధరమూర్తి

పలమనేరు, జనవరి16 : సంక్రాంతి సందర్భంగా పలమనేరు మున్సిపాలిటీలోని నీళ్లకుంట గ్రామంలో సీపీఎం నాయకులు బుదవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలకు సీపీఎం నాయకులు గిరిధరగుప్తా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాజా, జయంతి, నవత, రాధ తదితరులు పాల్గొన్నారు.

జల్లిపేటలో భగవద్గీతపై ప్రచారం

పలమనేరు, జనవరి16 : ఉత్తరాయణం భోగిపండుగ, సంక్రాంతి పండుగల విశిష్టతను తెలియజేయడానికి త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇందు సేవాసమితి సభ్యులు ప్రచారం చేపట్టారు. మంగళవారం మండలంలోని జల్లిపేట, బోడిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆచార్య ప్రభోదానంద యోగీశ్వర్లు రచించిన 110 రకాల త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత సారాంశం ప్రకారం సంక్రాంతి అంటే గుణాలపై తిరుగుబాటు అని, సుఖ, భోగాలను విడిచి పెట్టి కర్మలను కాల్చివేసే విధానమే భోగి మంటలు అన్నారు. ఉత్తరాయ ణంలో మోక్షం పొందే అవకాశం ఉండడంతో మానవులకు అసలైన పెద్దపండుగ సంక్రాంతి అని వివరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రభోదసేవాసమితి ఇందుజ్ఞానవేదిక పలమనేరు, బంగారు పాళ్యం కమిటీ అధ్యక్షులు భాస్కర్, బాలాజి, సభ్యులు సాయిచరణ్, సిద్ధార్థ, రాజేంద్ర, జీవరత్న, వింధ్య, వాణిశ్రీ, జ్యోతి, రేఖ, కల్యాణి, హేమంత్, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

వేడుకగా సంక్రాంతి, కనుమ సంబరాలు

పుంగనూరు రూరల్, జనవరి16: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని బత్తలాపురం, చదళ్ల, నల్లగుంట్లపల్లె, ఏతూరు గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఉదయాన్నే ఇళ్ల ముందర రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. ప్రతి ఇంటా పశువులను అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేంగించారు. తర్వాత కాటమరాజు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చిట్లాకుప్ప చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

పెద్దపంజాణి: మాజీ మంత్రి అమరనాథరెడ్డి స్వగ్రామం పెద్దపంజాణి మండలం కెళవాతిలో కుటుంబ సభ్యులతో కలసి ఆయన కనుమ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామస్తులతో కలసి గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి గోపూజ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి సంక్రాంతి శుభాకంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి రేణుకారెడ్డి, సోదరుడు శ్రీనాథరెడ్డి, కుమారుడు ప్రసేన్‌రెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో సోమ, మంగళవారం రోజున సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం పెద్దల పండుగ సందర్భంగా పెద్దల సమాధులకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గ్రామాల్లో పశువులకు పూజలు నిర్వహించి కాటమరాజుకు పొంగళ్లు సమర్పించారు. చిట్లాకుప్పకు నిప్పు పెట్టారు. మంగళంపేట, ఎల్లంకివారిపల్లె పురవీధుల్లో పశువులను పరుగులు పెట్టించారు. పశువులను కట్టడి చేసిన యువకులకు బహుమతులు అందజేశారు.

రొంపిచెర్ల: మండలంలోని ఇళ్లముందు పచ్చని తోరణాలు, ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరించారు. పశువులను సింగారించి పూజలు చేశారు. పొంగళ్లు పెట్టారు. బొమ్మయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి గొబ్బెమ్మ ఆట, పాట కార్యక్రమంలో పాల్గొన్నారు.

సదుం: మండలంలో గ్రామ గ్రామాన ప్రతి ఇల్లూ బంధుమిత్రులు, రంగ వల్లులు, చిన్నారుల ఆనందోత్సాహాలతో కళకళలాడింది. రైతులు గోమాతలను శుభ్రం చేసి పసుపు కుంకుమలతో పూజలు చేసి వాటిని సుందరంగా అలంకరించారు. వాటికి ఇష్టమైన పదార్థాలను తినిపించి పూజించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన చిట్లాకుప్పల వద్దకు డప్పు వాయిద్యాల నడుమ తోలుకెళ్లారు. అక్కడ కొలువు దీరిన కాటమరాజుకు పూజలు నిర్వహించారు. ఎద్దులను బెదిరిస్తూ యువకులు హంగామా చేశారు.



సదుం మండలం జోగివారిపల్లెలో కాటమరాజుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు, రొంపిచెర్లలో గొబ్బెమ్మ ఆట పాటల్లో మాజీ సర్పంచ్ సుప్రియారెడ్డి, పెద్దపంజాణిలో కనుమ వేడుకల్లో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కాణిపాకంలో ఘనంగా స్వచ్ఛ తీర్థ కార్యక్రమం



స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జనవరి 16: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బస్టాండ్, వంద అడుగుల రోడ్డు, మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గిరి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దిగువమాఘంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న గల్లా కుటుంబ సభ్యులు

తవణంపల్లె, జనవరి 16: మండలంలోని దిగువమాఘంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, రామచంద్ర నాయుడు దంపతుల ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గల్లా కుటుంబ సభ్యులు స్థానిక రాజన్న పార్కు వరకు గ్రామస్తులతో కలిసి ర్యాలీగా వెళ్లి పార్కులో ఉన్న మాజీ ఎంపీ స్వర్గీయ రాజగోపాల్ నాయుడి విగ్రహానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అలాగే గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ గ్రామస్తులతో కలిసి స్వగ్రామం దిగువమాఘంలో సంక్రాంతి పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాతకాలం నాటి సంప్రదాయాలు భావితరాలకు గుర్తుండేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్, గల్లా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీజేఎం చైర్మన్‌కు పలువురి శుభాకాంక్షలు



గజమాలతో గురజాల జగన్మోహన్‌ను సన్మానిస్తున్న అభిమానులు

చిత్తూరు సిటీ, జనవరి 16: టీడీపీ సీనియర్ నేత, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఆయన భారీ కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అలాగే నియోజకవర్గంలోని మురకంబట్టు, సంతపేట, ఇరువారం తదితరప్రాంతాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్‌చేశారు. పార్టీ శ్రేణులు పుష్పగుచ్చాలు ఇచ్చి, శాలువలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జగన్మోహన్ ప్రజలకు సంక్రాంతి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, పార్టీ నేతలు దొరబాబు, కటారి హేమలత, చంద్రప్రకాష్, కోదండయాదవ్, కాజూరు బాలాజి, వసంత్, త్యాగరాజన్, సుబ్రమణ్యం నాయుడు, పీటర్, శశికర్‌బాబు, మోహన్‌రాజ్, హేమాద్రి నాయుడు, వినయ్, రాజేష్, శరత్, ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో...

గుడిపాల, జనవరి 16: టీడీపీ సీనియర్ నాయకుడు గురజాల జగన్‌మోహన్ జన్మదినం సందర్భంగా మండలంలోని అనుపు, కొత్తపల్లి, నారగల్లు, 197 రామాపురం, ఏఎల్‌పురం, గుడిపాల క్రాస్ తదితర గ్రామాల్లో సోమవారం భారీ కేక్‌ను కట్‌చేసి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, రవి నాయుడు, మురారి కన్నయ్య, సుబ్బా నాయుడు, గుర్రప్ప నాయుడు, చల్లా, కిట్టు, శంకర్, కొత్తపల్లి బాబు, ధనసింగ్, రవి నాయుడు, హరి, పళణి, జయ చంద్ర, కుమార్, మధుసూధన్ నాయుడు, ఉదయ, మురళీనాయుడు, సుమతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంటులో చెన్నారెడ్డిపల్లె జట్టు గెలుపు



క్రీడాకారులకు కప్‌ను అందిస్తున్న ఎన్ఆర్ఐలు మోహన్‌రెడ్డి, హరిబాబు

యాదమరి, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని చెన్నారెడ్డిపల్లె ధర్మరాజుల గుడి ఆలయ ఆవరణలో నిర్వహించిన హనుమాన్ క్రికెట్ టోర్నమెంటులో చెన్నారెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. గత మూడు రోజులుగా నిర్వహించిన టోర్నమెంటులో మండలంలోని టీములు పాల్గొన్నాయి. ఫైనల్‌కు చెన్నారెడ్డిపల్లె, కృష్ణంపల్లె జట్లు చేరుకోగా, చెన్నారెడ్డి పల్లె జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్లకు బీఎంఆర్ అధినేత భూమిరెడ్డి మోహన్‌రెడ్డి, ఎన్ఆర్ హరిబాబులు బహుమతులను ప్రదానం చేశారు. నగదును స్థానిక సర్పంచ్ బాలకృష్ణారెడ్డి, గోవిందరెడ్డిలు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గాలు వదిలి కలిసి పనిచేద్దాం

- ఆత్మీయ సమ్మేళన సభలో ఎమ్మెల్యే శ్రీనివాసులు, విజయానంద రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, పక్కన విజయానంద రెడ్డి

గుడిపాల, జనవరి 16: గతంలో ఎన్నో విభేదాలు ఉన్నా, వర్గాలు ఉన్నా అన్నీ వదిలిపెట్టి కలసి పనిచేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి అన్నారు. మంగళవారం మండల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహించారు. గుడిపాలలో భారీ మెజార్టీ రావాలని పిలుపునిచ్చారు. ఇదిలావుండగా కుప్పిగానిపల్లిలో సర్పంచ్ మధుసూదన్ రాయల్ ఆధ్వర్యంలో విజయానందరెడ్డి సమక్షంలో జనసేన యువ నాయకులు కొందరు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రమ్య, కార్పొరేటర్ కేపీ శ్రీధర్, నాయకులు హరిబాబురెడ్డి, భానుమతి రెడ్డి పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం: మహిళ అరెస్టు

బంగారుపాళ్యం, జనవరి 16: మండలంలోని కాటప్పగారిపల్లె వద్ద ఎస్ఈబీ అధికారులు మంగళవారం జరిపిన దాడుల్లో కర్ణాటక మద్యం కలిగివున్న శిల్ప అనే మహిళను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆమె వద్ద 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నందీశ్వరుడికి వైభవంగా పూజలు



చిత్తూరు కల్చరల్, జనవరి 16: సంక్రాంతి పండుగ చివరి రోజైన మంగళవారం కనుమ పండుగను నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. కనుమపండుగలో ఆవులను, గేదెలను, ఎద్దులను అలంకరించి పూలతో అలంకరించి నైవేద్యం పెట్టి పూజలు చేశారు. పశువులను వీధుల్లో ఊరేగించారు. స్థానిక అగస్థీశ్వరాలయంలో కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో నందీశ్వర స్వామికి పాలాభిషేకం నిర్వహించి, పూలు పండ్లు, కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకుమార్ ఆచార్యులు, పాలక మండలి చైర్మన్ శివప్రసాద్, కాళభైరవట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు టి. వెంకటేషన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పశువుల పండుగ



గోవులకు పూజలు చేస్తున్న దృశ్యం

నగరి, జనవరి 16: నగరి పట్టణ పరిధిలోని కీళపట్టులో గల అరుల్‌ముగ త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వైభవంగా పశువుల పండుగ జరుపుకున్నారు. ఆలయంలో అర్చకులచే గోపూజ, నందిపూజ నిర్వహించారు. అనంతరం 25 ఆవులకు మహిళలచే పూజలు చేయించి వాటికి హారతులిచ్చారు. అరటి పండు, బెల్లం ప్రసాదం ఆవులకు తినిపించారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఏటా విధిగా పశువుల పండుగను వైభవంగా జరపడం ఈ ఆలయ సాంప్రదాయమన్నారు.

వైభవంగా కనుమ

వెదురుకుప్పం, జనవరి 16: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో కనుమ పండుగను రైతులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గోవులను శుభ్రంగా కడిగి, అలంకరించి, పూజలు చేశారు.

పూతలపట్టు: మండలంలోని పలు గ్రామాల ప్రజలు కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పి.కొత్తకోట పంచాయతీ దొమ్మాలపల్లి మిట్టూరు గ్రామ ప్రజలు భారీఎత్తున కాటమరాజు మంట నిర్వహించి అధిక సంఖ్యలో పశువులకు పూజలు నిర్వహించి ప్రసాదాలు వితరణ చేశారు.

గుడిపాల: మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం



మండిక్రిష్ణాపురంలో పొంగళ్లు తీసుకొస్తున్న గ్రామస్తులు

కనుమ పండుగను వైభవంగా నిర్వహించారు. మండిక్రిష్ణాపురంలో దేశమారియమ్మ అమ్మవారికి భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కుబడులను తీర్చుకున్నారు. ముట్టుకూరుపల్లి, 197 రామాపురం, చుక్కావారిపల్లి, నంగమంగళం తదితర గ్రామాల్లో గంగమ్మకు పొంగళ్లు పెట్టి, పాడిపశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

పురవీధుల్లో ఊరేగిన వేణుగోపాలుడు



కార్వేటినగరం, జనవరి 16: టీటీడీ అనుబంధ ఆలయమైన వేణుగోపాల స్వామిని కనుమ పండగ సందర్భంగా పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కర్పూర హారతి నీరాజనాలు అర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ ఎంపీటీసీ మృతి

- పలువురు నేతల సంతాపం



అంత్యక్రియల్లో పాల్గొన్న మురళి

పూతలపట్టు, జనవరి 16: పూతలపట్టు పంచాయతీ నాగిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ గోపి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్, టీఎస్‌టీయూసీ రాష్ట్రనేత యువరాజ్ నా యుడు, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు కాంతారావు, హిమగిరి నాయుడు, ఊట్ల నాగరాజ నాయు డు, హేమాద్రి నాయుడు, హరి, ప్రతాపనేని చంద్రమౌళి, చి రంజీవి, జనార్దన్ నాయుడు, ఇందిర తదితరులు గో పీ కుటుంబసభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదిలావుండగా పి.కొత్తకోట ఎంపీటీసీ (వైసీపీ) భర్త నాగరాజ్‌తో ఇన్‌చార్జి మురళి మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది.

గ్రామీణ క్రీడలకు పునరుజ్జీవం తేవాలి

యాదమరి, జనవరి 16: అంతరించి పోతున్న గ్రామీణ క్రీడలకు పునరుజ్జీవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెహ్రూ యువకేంద్ర అకౌంట్స్ ఆఫీసర్ బాబురెడ్డి అన్నారు. స్వామివివేకానంద జయంతోత్సవాలను పురష్కరించుకుని మండలంలోని కీనాటంపల్లెలో యువనోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు క్రీడలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో హరినాయుడు, మునిచంద్ర నాయుడు, కిసాన్ యువజన సంఘం అధ్యక్షులు కిరణ్‌కుమార్ పాలొన్నారు.

ఘనంగా ఉత్తరాయణ పూజలు

చిత్తూరు కల్చరల్, జనవరి 16: స్థానిక శ్రీ కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయంలో సోమవారం మకర సంక్రాంతి పండుగ సందర్భంగా ఉత్తరాయణ సూర్యభగవానుడి పూజలు ఘనంగా జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శివకుమార్ ఆచార్యులు, చైర్మన్ శివప్రసాద్, కాళభైరవట్రస్టు వ్యవస్థాపకులు టి. వెంకటేశన్‌లతో భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంక్రాంతి కానుకలు

- పేదలను విస్మరించిన ప్రభుత్వం
- చిత్తూరులో 50 వేల కుటుంబాలకు నిత్యావసరాలు
- జీడీనెల్లూరులో 12 వేల మందికి దుస్తుల పంపిణీ



చిత్తూరు కొంగారెడ్డిపల్లెలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న జీజేఎం చైర్మన్ జగన్మోహన్, జీడీనెల్లూరులో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న థామస్

చిత్తూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్.. ఇలా పండుగలు వస్తే రేషన్‌కార్డులున్న పేదలందరికీ నిత్యావసర వస్తువులు కానుకల రూపంలో వచ్చేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక కానుకలను నిలిపేసింది. ప్రస్తుత ధరల నేపథ్యంలో పేదలకు పండుగ నిర్వహణ భారంగా మారింది. జిల్లాలోని కొందరు టీడీపీ నాయకులు మాత్రం తమ సొంత నిధులతో పేదలకు కానుకలను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రం చిత్తూరు నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నేత, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్ 50 వేల కుటుంబాలకు కానుకలను అందించారు. బియ్యం, గోధుమపిండి, మైదా పిండి, పెసరపప్పు, నెయ్యి, నూనె, బెల్లం వంటి 9 రకాల నిత్యావసరాలను ఇళ్లకు వెళ్లి పేదలకు అందించారు. అలాగే జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ తన సొంత నిధులతో ఇంటింటికి చీర, షర్టు, ధోతీ పంపిణీ చేయడం ప్రారంభించారు. ఇప్పటికే జీడీనెల్లూరు మండలంలో 12 వేల పేద కుటుంబాలకు పంపిణీ పూర్తికాగా, మిగిలిన మండలాల్లోనూ పంపిణీ చేయనున్నారు. పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ కూడా నియోజకవర్గంలోని దళితవాడల్లో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు సుమారు 5 వేల మంది మహిళలకు అందించారు. నగరి మండలం కీలపట్ల దళితవాడలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి అల్లీముత్తు 300 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. రామాపురం, ధర్మాపురం, చిన్నరాజుకుప్పం గ్రామాల్లో మొత్తం వెయ్యి చీరల్ని టీడీపీ నాయకులు పంపిణీ చేశారు.

చంద్రబాబు అరెస్ట్‌తో ఆయన విలువేంటో తెలిసింది

- టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్

గంగాధరనెల్లూరు, జనవరి 16: వైసీపీ కుట్రతో సీఐడీ అధికారులు చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి జైలుకు పంపిస్తే... ఆ అరెస్ట్ అక్రమమని మనదేశంతో పాటు ప్రపంచదేశాల్లోని ప్రజలు, ప్రముఖులు ఖండిస్తూ మద్దతు పలికినపుడే ఆయన విలువ ఏమిటనేది అందరికీ తెలిసిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ పేర్కొన్నారు. బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, మన ఇంటికి మన డాక్టర్ థామస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పొదిలి రఘునాథ నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని బుక్కాపట్నం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్రాంతి కానుకగా దుస్తులబ్యాగ్‌ను థామస్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నా స్వంత గ్రామమైన అల్లాగుంటలో ఏవిధంగా అయితే ప్రజలు ఆదరిస్తున్నారో అంతకంటే ఎక్కువగా బుక్కాపట్నం పంచాయతీలో ప్రజలు ఇంటింటివద్ద మంగళహారతులతో నీరాజనాలు పలకడం ఆనందం కలిగిస్తున్నదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీకి ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాచిగుంట శిల్ప, దేవపత్ని ధనంజయ నాయుడు, స్వామిదాస్, ప్రకాష్‌రెడ్డి, ధర్మారెడ్డి, జ్యోతియాదవ్, విశ్వనాధరెడ్డి, బుక్కాపట్నం, వరత్తూరు, పాచిగుంట పంచాయతీలతో పాటు మండలంలోని పలువురు నేతలు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన డాక్టర్ థామస్



కార్వేటినగరం, జనవరి 16: నారావారిపల్లెలో టీడీపీ అధినేత చంద్రబాబును, లోకేశ్‌ను సోమవారం జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబును కలసిన రావెళ్ల లోకేష్



శ్రీరంగరాజపురం, జనవరి 16: ఎస్ఆర్‌పురం మండలం కట్టికపల్లె గ్రామానికి చెందిన టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావెళ్ల లోకేష్ మంగళవారం నారావారిపల్లెలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

నారావారి పల్లెకు మండల టీడీపీ నాయకులు



గాలి భానుప్రకాశ్‌ను కలిసిన టీడీపీ నేతలు

విజయపురం, జనవరి 16: విజయపురం మండలం నుంచి టీడీపీ నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబును, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను, నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్‌ను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి పురుషోత్తం, నాయకులు గాలి మురళీ, రమేశ్‌యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల నియామకం హర్షణీయం

- పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు



నగరి టవర్‌క్లాక్‌వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నగరి, జనవరి 16: పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిలను పార్టీ అధిష్ఠానం నియమించడం హర్షణీయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు పేర్కొన్నారు. ఈ మేరకు నగరి పట్టణ పరిధిలోని టవర్‌క్లాక్ వద్ద బాబు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తప్పక వస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు భానుమూర్తి, పీసీసీ సభ్యులు నటరాజముదలియార్, డీసీసీ కార్యదర్శులు డిల్లీ, చిరంజీవిరెడ్డి, కుమార్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

పూతలపట్టు జనవరి 16: ఏపీ కాంగ్రెస్‌లోకి షర్మిల రాకతో పార్టీకి పూర్వవైభవం ఖాయమని పీసీసీ డెలిగేట్ సభ్యురాలు విక్టోరియా ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం షర్మిలను పీసీసీ చీఫ్‌గా నియమించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో విక్టోరియా పూతలపట్టులో టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నగరి, జనవరి 16: నగరి పట్టణ పరిధిలోని కీళపట్టులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన చిత్తూరు పార్లమెంటరీ ఎస్సీ సెల్ కార్యదర్శి అల్లిముత్తు సౌజన్యంతో నాయకులు మంగళవారం మహిళలకు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ కార్యదర్శి శ్రీనివాసన్, అల్లిముత్తు, రాజేంద్రన్, కృష్ణారెడ్డి, రుక్మం బాలాజీ, నారాయణస్వామి నాయుడు, దామోదరం, శ్రీనివాసులు, విజయ్, చిరంజీవి, చిన్నికృష్ణ, జ్ఞానరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం: జనసేన

విజయపురం, జనవరి 16: వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్ విమర్శించారు. మంగళవారం మండలంలోని ఆలపాకం వడ్డిండ్లు, ఆలపాకం, ఒరూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఆ పార్టీని నమ్మితే అధోగతేనని పేర్కొన్నారు. నగరి ఉమ్మడి అభ్యర్థి గాలి భానుప్రకాశ్‌ను ఆదరించాలని ఆయన కోరారు.



ఆలపాకం వడ్డిండ్లలో కరపత్రాలతో మహిళలు

అనంతరం టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు ఓంశంకర్, కార్యదర్శి దేవదాసు, నాయకులు మనోహర్, నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మకరజ్యోతి దర్శనం



అయ్యప్పస్వామికి ఆభరణాలు తీసుకెళ్తున్న సుధాకర్

గుడిపాల, జనవరి 16: మండలంలోని 197 రామాపురంలో వెలసియున్న వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో వున్న అయ్యప్ప మందిరంలో సోమవారం సాయంత్రం భక్తులకు మకరజ్యోతి దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం స్వామివారిని మేల్కొలిపి కాగడహారతి, దీపారాధన చేశారు. మణికంఠస్వామి అయ్యప్ప ప్రత్యేక అలంకరణ చేసి తిరు ఆభరణాలతో పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గురుస్వామి మురారి కన్నయ్య అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కనువిందు చేసిన జ్యోతి దర్శనం

చిత్తూరు కల్చరల్, జనవరి 16: స్థానిక ప్రశాంత్‌నగర్ కాలనీ శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సంక్రాంతి సందర్భంగా అయ్యప్పస్వామి మకర జ్యోతి దర్శనం భక్తులకు కనువిందు చేసింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి నామస్మరణలతో పరిసర ప్రాంతాలన్ని మారుమోగాయి. అంతకు మునుపు ఆలయ నిర్వాహకులు అయ్యప్పస్వామి ఆభరణాలను స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయం నుంచి మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగిస్తూ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం స్వామి వారికి అలంకరించి అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవారం ఉదయం అయ్యప్పస్వామికి మండలాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



పొంగళ్లతో గ్రామస్తుల ఊరేగింపు, బాలగురునాథీశ్వర స్వామి

పాలసముద్రం, జనవరి 16: మండల పరిధిలోని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. శ్రీబొమ్మరాజుపురంలో గ్రామస్థులు పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్లి బాలగురునాథీశ్వర స్వామి ఆలయంలో నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, బెంగళూరునుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. కోలాటాలు, డ్రమ్స్ వాయిద్యాల కళాకారులు సందడిచేశారు. గంగిరెద్దుల ఊరేగింపు, బుడబుక్కలోళ్ల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం పశువుల పండుగ కావడంతో రైతులు తమ పాడి ఆవులు, ఎద్దులకు స్నానం చేయించి, కొమ్ములకు రంగులు వేసి, పూజలు చేశారు.

విజయపురం: మండలంలో సోమవారం సంక్రాంతిని, మంగళవారం



పాతార్కాడులో మహిళలు వేసిన ముగ్గులు

కనుమను వైభవంగా జరుపుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని యువత వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలకు డ్యాన్స్, ఆటలు, పాటల పోటీలు, మ్యూజికల్‌చైర్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసి వాటికి పూజలు నిర్వహించారు.

కమనీయంగా సీతారాముల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, జనవరి 16: స్థానిక కోదండరామాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈవో సుబ్రమణ్య నాయుడు ఆధ్వర్యంలో సోమవారం సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేణుగోపాల్ అర్చకబృందం పీలేరు సీతరామిరెడ్డి దంపతుల ఉభయంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులకు స్వామివారి కల్యాణోత్సవ అక్షింతలు, ప్రసాదాలతో పాటు మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మ ఆలయానికి పోటెత్తిన జనం



క్యూలో భక్తుల రద్దీ, ప్రత్యేక అలంకరణలో ఆరిమాని గంగమ్మ

శ్రీరంగరాజపురం, జనవరి 16: ఎస్ఆర్‌పురం మండలం ఆరిమాకులపల్లె గ్రామంలో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయంలో కనుమ పండుగ రోజున మూడు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలకరించి, నైవేద్యం సమర్పించారు. అధికారులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

పలమనేరు, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా పలమనేరు మున్సిపాలిటీలోని నీళ్లకుంటలో సీపీఎం నాయకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారితోపాటు పోటీల్లో పాల్గొన్నమహిళలకు సీపీఎంనేత గిరిధరగుప్తా బహుమతులు అందజేశారు.